RNI NO:APTEL /2023/90201

# రాజధాని వాయిస్

తెలుగు దినపత్రిక

web : www.rajadhanivoice.in  rajadhanivoicedaily@gmail.com

RAJADHANI VOICE రాజధాని వాయిస్ TELUGU DAILY

విలేఖరులు కావలెను

రాజధాని వాయిస్ తెలుగు దినపత్రికలో కొనసాగుటకు
గుంటూరు,పల్నాడు,జిల్లాలలో స్టాఫర్లు
నియోజకవర్గాలకు ఇంచార్జులు మరియు
మండలాల వారిగా విలేఖరులు కావవలెను
ఆసక్తి గలవారు సంప్రదించగలరు.
9030343195
అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును

సంపుటి : 02 | సంచిక : 288 | 9 బుధవారం సెప్టెంబరు 2026 | ఎడిటర్ : పాగళ్ల పూర్ణచంద్రరావు | పేజీలు : 4 | వెల : రూ.1/-

## ఉత్తరాంధ్రలో వైకాపాకు బిగ్‌షాక్.. తెదేపాలో చేరిన బొత్స మేనల్లుడు



**విజయనగరం, సెప్టెంబర్ 8 రాజధాని వాయిస్ :** స్థానిక ఎన్నికల ముందు ఉత్తరాంధ్రలో వైకాపాకు బిగ్ షాక్ తగిలింది. మాజీ మంత్రి, శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ మేనల్లుడు, విజయనగరం జిల్లా వైకాపా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) ఆ పార్టీకి రాజీనామా చేసిన తెదేపాలో చేరారు. ఈ మేరకు తన రాజీనామా లేఖను వైకాపా అధ్యక్షుడు జగన్‌కు పంపారు. విజయనగరం జడ్పీ ఛైర్మన్, భీమిలి వైకాపా ఇన్‌ఛార్జ్‌గానూ చిన్న శ్రీను పనిచేస్తున్నారు. వైకాపా సభ్యత్వంతో పాటు విజయనగరం జిల్లా అధ్యక్ష పదవి, భీమిలి ఇన్‌ఛార్జ్ పదవికీ ఆయన రాజీనామా చేశారు. కొన్నాళ్లుగా బొత్స సత్యనారాయణ, చిన్న శ్రీను మధ్య కోల్డ్ వార్ జరుగుతోంది. పార్టీలో మేనల్లుడి ప్రాధాన్యం తగ్గించేలా బొత్స ప్రయత్నిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో చిన్న శ్రీను వైకాపాకు రాజీనామా చేయడం చర్చనీయాంశంగా మారింది.

**సీఎం చంద్రబాబు సమక్షంలో తెదేపాలోకి..**

వైకాపాకు రాజీనామా చేసిన అనంతరం చిన్న శ్రీను తెదేపాలో చేరారు. ఆ పార్టీ అధినేత, సీఎం చంద్రబాబుసమక్షంలో అనుచరులతో కలిసి పసుపు కండువా కప్పుకొన్నారు. శ్రీను కుమార్తె సిరి సహస్ర, ఆమె అనుచరులు కూడా తెదేపాలో చేరారు. పార్టీలో చిన్న శ్రీను చేరిక కార్యక్రమానికి మంత్రులు అనిత, కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు కళా వెంకట్రావు, కొండ్రు మురళి, కోళ్ల లలితకుమారి తదితరులు హాజరయ్యారు.

## ఎల్‌నినో.. తాగునీటికే మొదటి ప్రాధాన్యం: చంద్రబాబు



**అమరావతి, సెప్టెంబర్ 8రాజధాని వాయిస్ :** ఎల్‌నినో వల్ల ఏపీపై ప్రతికూల ప్రభావం పడుతోందని సీఎం చంద్రబాబు అన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే 54శాతం లోటు వర్షపాతం నమోదైందని, జలాశయాల్లో గతేడాది 737 టీఎంసీల నీరు ఉంటే.. ఈసారి 530 టీఎంసీలే ఉందని తెలిపారు. ఎల్‌నినోపై జరిగిన చర్చలో నేతలకు ఆయన దిశానిర్దేశం చేశారు. భూగర్భ జలాలు కూడా గణనీయంగా తగ్గుతున్నాయని అన్నారు. "నెల్లూరు, తిరుపతి, కోనసీమ జిల్లాల్లో వేయాల్సిన దానికన్నా ఎక్కువగా పంటలు వేశారు. మార్కాపురం, పోలవరం, ప్రకాశం జిల్లాల్లో 12శాతం పంటలే వేశారు. ఉద్యాన పంటలు కూడా పెద్ద ఎత్తున సాగు చేస్తున్నారు. సంక్షోభం దృష్ట్యా తాగునీటికే మొదటి ప్రాధాన్యత ఇస్తాం. బోర్లు ఎండిపోయిన చోట తాగునీటి కొరత లేకుండా చూడాలి. ప్రతి ఎకరాన్నీ పీఎండీఎస్ విధానంలో సాగు చేసేలా చూడాలి. 32 రకాల విత్తనాలను పీఎండీఎస్ ద్వారా సాగు చేసేందుకు అవకాశం ఉంది. సాగునీటి ప్రాజెక్టులకు మా ప్రభుత్వమే ఎక్కువ ఖర్చు చేసింది. ఉచిత ఇసుక.. ఇతర రాష్ట్రాలకు వెళ్తే అడ్డుకోవాలి. ఏటా రూ.1000 కోట్ల ఆదాయం వదులుకొని ఉచిత ఇసుక ఇస్తున్నాం. వైకాపా పాలనలో జే బ్రాండ్ల వల్ల 30 వేల మంది ప్రాణాలు కోల్పోయారు. మద్యాన్ని ఎమ్మార్పీ కంటే ఎక్కువకు విక్రయించేందుకు వీల్లేదు. గొడ్డలి పార్టీ నేతల దుష్ప్రచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించవద్దు. టీచర్లను బెదిరించే స్థాయికి గొడ్డలి పార్టీ మీడియా దారుణాలకు ఒడిగట్టింది. ఇలా బరితెగించే వారిని ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించ కూడదు" అని చంద్రబాబు అన్నారు.

## డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో ఇకపై రోజువారీ విచారణ.. హైకోర్టు ఆదేశం



**రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 8 రాజధాని వాయిస్ :** దళిత యువకుడు, డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం హత్య కేసు విచారణలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఇకపై రోజువారీ విచారణ చేపట్టాలని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు రాజమహేంద్రవరం ప్రత్యేక న్యాయస్థానం జడ్జికి ఆదేశాలు జారీ చేసింది.ఈ కేసులో వైకాపా ఎమ్మెల్సీ అనంతబాబు ప్రధాన నిందితుడిగా ఉన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో రాజమహేంద్రవరంలో ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేయగా.. హైకోర్టు ఈ కేసును పర్యవేక్షిస్తోంది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఆగస్టు నెలాఖరుకు ట్రయల్స్ పూర్తికావాల్సింది. కానీ.. విచారణలో జాప్యం కావడంతో సమీక్షించిన ఉన్నత న్యాయస్థానం.. ఇకపై రోజువారీ విచారణకు ఆదేశించింది.హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో రాజమహేంద్రవరం ప్రత్యేక న్యాయస్థానం ఈనెల 11 నుంచి రోజువారీ విచారణ ప్రారంభించనుంది. సాక్షుల వాంగ్మూలాల నమోదు ప్రక్రియ చేపట్టనుంది. ఈ మేరకు పోలీసులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్, నిందితుల తరపు న్యాయవాదులకు ప్రత్యేక న్యాయస్థానం సమాచారం ఇచ్చింది.

## డిఎస్సీ స్పోర్ట్స్ కోటా అవకతవకలపై స్వతంత్ర సంస్థతో విచారణ

- సిపిఎం డిమాండ్




**అమరావతి, సెప్టెంబర్ 8 రాజధాని వాయిస్ :** డిఎస్‌సి స్పోర్ట్స్ కోటాలో జరిగిన అవకతవకలపై స్వతంత్ర సంస్థతో విచారణ నిర్వహించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివా సరావు మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ప్రభుత్వం చెబుతున్న వివరణ మరిన్ని కొత్త సందేహాలను కలిగిస్తోందని పేర్కొన్నారు. ఉద్యోగ నియామకాల్లో మార్గదర్శకాలను ఇష్టానుసారంగా మార్చుకున్నట్లు అనేక ఆధారాలు ఇటీవల వెలుగులోకి వస్తున్నాయని, ఈ వ్యవహా రంలో కొద్దిమందిని ఇప్పటికే అరెస్టు చేయడం, మరికొన్ని ఘటనలపై విచారణ చేస్తున్నట్లు ప్రభు త్వం ప్రకటించడం ద్వారా స్పోర్ట్స్ కోటా నియామ కాల్లో అవకతవకలు జరిగినట్లు స్పష్టమవుతోందని తెలిపారు. వీటిపై ప్రభుత్వం సమగ్రంగా, నిష్పక్షపాతంగా విచారణ జరిపి నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు.

**సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి**

సచివాలయ ఉద్యోగులకు ప్రొబేషన్ కాలాన్ని రెగ్యులర్ సర్వీసుగా పరిగణించాలని, నోషనల్ ఇంక్రిమెంట్లు, బకాయి పడిన డిఏ, హెచ్‌ఆర్ఏ వెంటనే విడుదల చేయాలని సిపిఎం డిమాండ్ చేసింది. సచివాలయ ఉద్యోగుల ఆందోళనకు సిపిఎం రాష్ట్ర కమిటీ - మిగతా 2లో..

## ఆరంభమే ఆశాజనకం.. చివరికి సంక్షోభం

ఎన్‌టిఆర్ జిల్లాలో అడుగంటిన భూగర్భ జలాలు
- 291 చెరువులు ఖాళీ.. కుదేలైన వ్యవసాయం
- ఉపాధి కోల్పోతున్న వ్యవసాయ కార్మికులు, నిత్యవసరాల ధరల మంట

**ఎన్‌టీఆర్, సెప్టెంబర్ 8రాజధాని వాయిస్ :** : ఖరీఫ్ సీజన్ ఆరంభంలో ఆశాజనకంగా కనిపించిన వర్షపాతం... రోజులు గడిచే కొద్దీ అన్నదాతల ఆశలపై నీళ్లు చల్లింది. జిల్లా వ్యాప్తంగా జలవనరులు పూర్తిగా అడుగంటిపోవడంతో ఎన్‌టిఆర్ జిల్లాలో తీవ్ర నీటి సంక్షోభం నెలకొంది. కృష్ణా బేసిన్‌లో ఎగువన నీరు లేకపోవడం, ప్రకాశం బ్యారేజీ మినహా జిల్లాలోని మొత్తం 291 చెరువులు పూర్తిగా ఎండిపోవడంతో ప్రధాన పంటల సాగు విస్తీర్ణం దారుణంగా పడిపోయింది. వర్షాలు లేక స్థానిక నీటి వనరులు ఎండిపోవడంతో ఒకవైపు వ్యవసాయ కార్మికుల ఉపాధి దెబ్బతినగా, మరోవైపు మార్కెట్‌లో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. - మిగతా 2లో..

## ప్రజా సేవలపై మరింత దృష్టి పెట్టాలి: చంద్రబాబు

- ఉత్తమ పద్ధతులను అన్ని నియోజకవర్గాల్లో అమలు చేయాలి
- ఉచిత ఇసుక విధానంపై ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం
- ఫేక్ ప్రచారాన్ని వాస్తవాలతో తిప్పికొట్టాలని సూచన
- భూ రికార్డుల ప్రక్షాళన 2027 మార్చి నాటికి పూర్తి



**అమరావతి, సెప్టెంబర్ 8 రాజధాని వాయిస్ :** ప్రభుత్వ, పరిపాలన సేవలను ప్రజలకు మరింత సమర్థవం తంగా అందించడంపై దృష్టి సారించాలని టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులకు పిలుపునిచ్చారు. రెండో రోజు నిర్వహించిన లీడర్‌షిప్ కాన్‌క్లేవ్‌లో ప్రసంగించిన ఆయన, కొన్ని నియోజకవర్గాలు పౌర సేవల అమలులో విశేష ఫలితాలు సాధిస్తున్నాయని పేర్కొన్నారు. ఆ ప్రాంతాల్లో అమలవుతున్న ఉత్తమ పద్ధతులను రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలు అనుసరించాలని సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఉచిత ఇసుక విధానాన్ని ప్రభుత్వం కట్టుదిట్టంగా అమలు చేస్తోందని చంద్రబాబు తెలిపారు. ఈ నిర్ణయం వల్ల ప్రభుత్వానికి ఏటా సుమారు రూ.1,000 కోట్ల ఆదాయం కోల్పోతున్నప్పటికీ ప్రజల ప్రయోజనాల కోసమే ఈ విధానాన్ని కొనసాగిస్తున్నామని చెప్పారు. ఎక్కడైనా ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నట్లు గుర్తిస్తే వెంటనే అడ్డుకోవాలని, ముఖ్యంగా ఇతర రాష్ట్రాలకు అక్రమంగా తరలిపోకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు సూచించారు.గత ప్రభుత్వ హయాంలో మద్యం విధానం పూర్తిగా అస్తవ్యస్తమైందని చంద్రబాబు విమర్శించారు. నకిలీ బ్రాండ్లను ప్రోత్సహించడం ద్వారా ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టారని ఆరోపించారు. ప్రస్తుతం మద్యం విక్రయాల్లో పారదర్శకత తీసుకొచ్చామని, ఎమ్మార్పీ కంటే ఒక్క రూపాయి ఎక్కువకు విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మద్యం విక్రయాల్లో ఎలాంటి అవకతవకలు జరగకుండా పర్యవేక్షించాల్సిన బాధ్యత స్థానిక ఎమ్మెల్యేలదేనని స్పష్టం చేశారు. - మిగతా 2లో..

## అక్షరాస్యత, నాణ్యమైన విద్యకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం: మంత్రి




**నెల్లూరు, సెప్టెంబర్ 8 రాజధాని వాయిస్ :** ప్రతి ఒక్కరికీ నాణ్యమైన విద్య, అక్షరాస్యత అందేలా కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. విద్యను ప్రతి ఒక్కరి హక్కుగా, అక్షరాస్యతను సాధికారతకు మార్గంగా మార్చి ప్రతి కుటుంబానికి మెరుగైన భవిష్యత్తు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా మంత్రి స్పందిస్తూ విద్యా రంగ అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. సమాజ పురోగతికి అక్షరాస్యత కీలకమని, ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందేలా చర్యలు చేపడు తున్నామని తెలిపారు. నెల్లూరు జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేసే దిశగా ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, తరగతి గదుల అభివృద్ధి, విద్యార్థులకు అవసరమైన సౌకర్యాల విస్తరణపై దృష్టి సారిస్తున్నామని వివరించారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడం ద్వారా ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో విశ్వాసం పెంచే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. విద్యా ప్రమాణాల పెంపు కోసం అవసరమైన చర్యలను నిరంతరం చేపడుతు న్నామని పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగంలో సంస్కరణలు తీసుకొస్తూ భవిష్యత్ తరాలకు బలమైన పునాది వేస్తోందని మంత్రి అన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య విద్యా అవకాశాల్లో ఉన్న అంతరాన్ని తగ్గించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. విద్య ద్వారా సమాజంలో సమాన అవకాశాలు కల్పించడం సాధ్యమవుతుందని పేర్కొన్న మంత్రి, అక్షరాస్యత పెంపు కోసం ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు.

## పరిశ్రమల ఖాళీ స్థలాలను హరిత వనాలుగా మార్చాలి: నాగబాబు

- దివిస్ లేబొరేటరీస్‌లో గ్రీన్‌బెల్ట్ కార్యక్రమాల సమీక్ష
- స్థానిక వృక్ష జాతులతో హరితాభివృద్ధికి పిలుపు
- మియావాకి విధానానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచన
- ఉద్యోగులతో కలిసి మొక్కలు నాటిన ఎమ్మెల్సీ



**తొండంగి, సెప్టెంబర్ 8రాజధాని వాయిస్ :** పర్యావరణ పరిరక్షణ, జీవవైవిధ్య సంరక్షణలో పరిశ్రమలు కీలక పాత్ర పోషించాలని ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్సీ నాగబాబు అన్నారు. పరిశ్రమల పరిధిలో ఉన్న ఖాళీ స్థలాలను హరిత వనాలుగా అభివృద్ధి చేసి పచ్చదనాన్ని పెంపొందించాలని సూచించారు. కాకినాడ జిల్లా తొండంగిలోని దివిస్ లేబొరేటరీస్‌ను - మిగతా 2లో..

## విమానాశ్రయ కొత్త టెర్మినల్ నిర్మాణ పనులపై సమీక్ష

- విమానాశ్రయ అభివృద్ధి పనులను పరిశీలించిన కేంద్ర మంత్రి రామ్ మోహన్ నాయుడు
- ఏఏఐ ఛైర్మన్‌తో కలిసి పురోగతిపై సమీక్ష
- రాష్ట్రవ్యాప్తంగా విమానయాన ప్రాజెక్టులపై చర్చ
- పర్యాటకం, వాణిజ్యానికి మెరుగైన అనుసంధానమే లక్ష్యమని వెల్లడి



**విజయవాడ, సెప్టెంబర్ 8రాజధాని వాయిస్ :** విజయవాడ విమానాశ్రయంలో నిర్మాణంలో ఉన్న కొత్త టెర్మినల్ భవనం పనుల పురోగతిని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్ మోహన్ నాయుడు మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా భారత విమానాశ్రయాల ప్రాధికార సంస్థ (ఏఏఐ) ఛైర్మన్, ఆంధ్రప్రదేశ్ ఎయిర్‌పోర్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్, పరిశ్రమల శాఖ కార్యదర్శితో - మిగతా 2లో..

## ఇబ్రహీంపట్నం పీఎస్‌కు యూట్యూబర్ నందన



శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో అరెస్టయిన యూట్యూబర్ నందనను పోలీసులు ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం పీఎస్‌కు తీసుకొచ్చారు. విదేశాల్లో ఉద్యోగాల పేరిట మోసాలకు పాల్పడ్డారంటూ నందన, ఆమె భర్తపై ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో పలువురు బాధితులు ఫిర్యాదు చేయడంతో ఇబ్రహీంపట్నం పీఎస్‌లో గతంలో కేసు నమోదైంది. ఈ విషయం వెలుగులోకి రాగానే నందన దంపతులు అజ్ఞాతంలోకి వెళ్లడంతో ఏపీ పోలీసులు లుక్ అవుట్ సర్క్యులర్(ఎల్‌వోసీ) జారీ చేశారు. ఈ క్రమంలో బ్రిటిష్ ఎయిర్‌లైన్స్ విమానంలో స్వదేశానికి ఒంటరిగా బయలుదేరిన నందన సోమవారం శంషాబాద్‌లో దిగారు. ఆమె పాస్‌పోర్ట్, వీసా పత్రాలు తనిఖీ చేసిన ఇమిగ్రేషన్ అధికారులు ఎల్‌వోసీ ఆధారంగా అదుపులోకి తీసుకొని ఇబ్రహీంపట్నం పోలీసులకు అప్పగించారు. విచారణ నిమిత్తం ఇబ్రహీంపట్నం పోలీసులు పీఎస్‌కు తీసుకొచ్చారు.

# సెప్టెంబరు 11న మోదీ-పుతిన్ భేటీ



ప్రధాని నరేంద్ర మోదీ సెప్టెంబర్ 11న రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో భేటీ కానున్నారు. ఈ నెల 12-13 తేదీలలో దిల్లీలో భారత్ అధ్యక్షతన 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం జరగనున్న విషయం తెలిసిందే. ఆ సమావేశానికి ముందు ఇరువురు దేశాధినేతలు ద్వైపాక్షిక చర్చల్లో పాల్గొననున్నట్లు రష్యా అధ్యక్ష కార్యాలయం క్రెమ్లిన్ అధికార ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్ వెల్లడించారు. భారత్ తమకు వ్యూహాత్మక భాగస్వామి అని.. ఇరుదేశాల మధ్య భద్రత, అంతరిక్షం, ఇంధనం, రవాణా, సైన్స్ అండ్ టెక్నాలజీ సహా పలు రంగాలలో సహకారం విస్తరిస్తోందన్నారు.ఇరుదేశాల నేతలు ద్వైపాక్షిక సమావేశంలో వాణిజ్యం, ఆర్థిక సంబంధాలకు పెద్దపీట వేయనున్నారని డిమిత్రి పేర్కొన్నారు. ఉక్రెయిన్‌తో యుద్ధం, గల్ఫ్ ఉద్రిక్తతలు, ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై దాని ప్రభావం వంటి విషయాలపైనా చర్చలు జరిపే అవకాశం ఉందన్నారు. రష్యా-ఉక్రెయిన్ సంక్షోభాన్ని పరిష్కరించడంలో భారత్ మధ్యవర్తిత్వం వహించడం తమకు అంగీకారమేనని తెలిపారు. యుద్ధాన్ని ముగించడానికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సైతం తీవ్రంగా కృషి చేస్తున్నారన్నారు. ఉక్రెయిన్‌తో చర్చలు తిరిగి ప్రారంభించడానికి అమెరికా చర్యలు తీసుకుంటోందన్నారు.

**బ్రిక్స్ ఇప్పుడు ఒక భారీ కూటమి..**

బ్రిక్స్ కేవలం ఒక సాధారణ సంస్థ మాత్రమే కాదని..అదొక ప్రధాన ప్రపంచ కూటమి అని డిమిత్రి అభివర్ణించారు. ఈ కూటమి మరింత విస్తరించాలని రష్యా కోరుకుంటోందన్నారు. బ్రిక్స్ సమావేశాల్లో మరిన్ని దేశాలు పాల్గొంటే బాగుంటుందని.. ఇతర దేశాలను ఆహ్వానించడానికి తమ మద్దతు ఎప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు.

**భారత్‌తో అణు సహకారంపై దృష్టి..**రష్యా-భారత్ సహకారంలో అణు శక్తి ఒక కీలక రంగమని డిమిత్రి పేర్కొన్నారు. 'అణు రంగంలో రష్యా ప్రపంచ అగ్రగామిగా ఉంది. ప్రపంచంలోని అన్ని దేశాల కంటే మేమే ఎక్కువ అణు విద్యుత్ కేంద్రాలను నిర్మిస్తున్నాం. భారత్‌లో కుడంకుళం ప్రాజెక్ట్ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. భారత్‌లో నిర్మించబోయే మరో కొత్త ప్లాంట్‌కు సంబంధించి చర్చలు జరుగుతున్నాయి" అని పేర్కొన్నారు.

# అందరికీ అందుబాటులో ఆరోగ్య సేవలే లక్ష్యం: కేంద్ర మంత్రి జేపీ నడ్డా

- నాణ్యమైన వైద్య సేవల కోసం ఆరోగ్య రంగం బలోపేతం
- గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో వైద్య సదుపాయాల విస్తరణకు చర్యలు
- డిజిటల్ హెల్త్ ప్లాట్‌ఫారమ్‌ల వినియోగాన్ని పెంచుతున్న భారత్



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 8 రాజధాని వాయిస్** : ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) దక్షిణ-ఆగ్నేయాసియా ప్రాంతీయ కమిటీ 79వ సమావేశంలో నిర్వహించిన మంత్రుల రౌండ్‌టేబుల్ సమావేశంలో కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమానత్వంతో కూడిన, అందరికీ అందుబాటులో ఉండే ఆరోగ్య సేవల కల్పన పట్ల భారతదేశం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా ఆరోగ్య మౌలిక వసతులను బలోపేతం చేయడంతో పాటు ఆరోగ్య సిబ్బంది సామర్థ్యాన్ని పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలను వివరించారు.వైద్య సేవలు అందని ప్రాంతాల్లో మెడికల్ విద్యను విస్తరిస్తున్నామని, తద్వారా గ్రామీణ ప్రాంతాల్లో వైద్యుల కొరతను తగ్గించేందుకు కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి రిఫరల్ ఆసుపత్రుల వరకు సేవల నాణ్యతను మెరుగుపరుస్తున్నామని పేర్కొన్నారు. క్లిష్ట ప్రాంతాల్లో నిపుణులైన వైద్యుల లభ్యత పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. డిజిటల్ ఆరోగ్య రంగంలో భారత్ గణనీయమైన పురోగతి సాధించిందని జేపీ నడ్డా అన్నారు. ఈ-సంజీవని వంటి టెలీమెడిసిన్ సేవలు, ఏబీహెచ్‌ఏ ఆధారిత డిజిటల్ ఆరోగ్య రికార్డుల ద్వారా ప్రజలకు వేగవంతమైన వైద్య సేవలు అందుతున్నాయని చెప్పారు. డిజిటల్ సాంకేతికతను వినియోగిస్తూ ఆరోగ్య సేవలను మరింత సమర్థవంతంగా ప్రజలకు చేరవేస్తున్నట్లు వివరించారు.ప్రతి పౌరుడికి నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. సార్వత్రిక ఆరోగ్య సంరక్షణ సాధన దిశగా బహుళ నైపుణ్యాలు కలిగిన ఆరోగ్య సిబ్బందిని తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. గ్రామీణ, మారుమూల ప్రాంతాల ప్రజలకు సకాలంలో ఆరోగ్య సేవలు అందేలా చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఆరోగ్య రంగంలో సమగ్ర అభివృద్ధి ద్వారా దేశ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే ప్రభుత్వ లక్ష్యమని జేపీ నడ్డా స్పష్టం చేశారు. భవిష్యత్తులో కూడా ఆరోగ్య సేవల విస్తరణ, వైద్య సిబ్బంది బలోపేతం, డిజిటల్ ఆరోగ్య వ్యవస్థ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తామని పేర్కొన్నారు.

# ప్రజా సేవలపై మరింత దృష్టి పెట్టాలి: చంద్రబాబు





ప్రభుత్వంపై జరుగుతున్న ఫేక్ ప్రచారాలను వాస్తవాలతో సమర్థంగా తిప్పికొట్టాలని పార్టీ నేతలకు సూచించారు. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా అనేక ప్రభుత్వ సేవలను ప్రజలకు ఆన్‌లైన్‌లో అందిస్తున్నామని తెలిపారు. క్యూఆర్ కోడ్, బ్లాక్‌చెయిన్ సాంకేతికత ఆధారంగా భద్రమైన పట్టాదారు పాస్ పుస్తకాలను జారీ చేస్తున్నామని వివరించారు. ప్రభుత్వ కార్యక్రమాలు, సంక్షేమ పథకాలపై ప్రజలకు సరైన సమాచారం చేరేలా నాయకులు చొరవ చూపాలని కోరారు.నియోజకవర్గాల్లో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను స్వచ్ఛందంగా గుర్తించి పరిష్కరించాలని చంద్రబాబు సూచించారు. ప్రజల సమస్యల పట్ల మానవత్వంతో స్పందిస్తే ప్రజల్లో సానుకూల దృక్పథం ఏర్పడుతుందని చెప్పారు. ప్రజలతో నిరంతర సంబంధాలు కొనసాగిస్తూ వారి అవసరాలను అర్థం చేసుకుని పరిష్కార మార్గాలు చూపాలని ఎమ్మెల్యేలకు సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారమే నాయకులకు మంచి పేరు తీసుకువస్తుందని అన్నారు.రాష్ట్రవ్యాప్తంగా భూ వివాదాల పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని చంద్రబాబు వెల్లడించారు. 2027 మార్చి నాటికి భూ రికార్డుల ప్రక్షాళన పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. 'సంజీవని' ప్రాజెక్టు ద్వారా ప్రజలకు డిజిటల్ ఆరోగ్య రికార్డులు అందుబాటులోకి తీసుకువస్తున్నామని చెప్పారు. గత సమావేశంలో ఎమ్మెల్యేలు ప్రస్తావించిన అంశాలను సమీక్షించి, రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో రూ.20,400 కోట్ల విలువైన 616 అభివృద్ధి పనులకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని ఈ సందర్భంగా ప్రకటించారు.

## విమానాశ్రయ కొత్త టెర్మినల్ నిర్మాణ పనులపై సమీక్ష




కలిసి నిర్మాణ పనులను పరిశీలించారు. కొత్త టెర్మినల్ నిర్మాణం పూర్తయిన తర్వాత ప్రయాణికులకు మరింత మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని మంత్రి తెలిపారు. పెరుగుతున్న ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ఆధునిక వసతులతో టెర్మినల్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు.అనంతరం రాష్ట్రంలో కొనసాగుతున్న వివిధ విమానయాన ప్రాజెక్టులు, విమానాశ్రయాల సామర్థ్య విస్తరణ కార్యక్రమాలపై సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. విమానాశ్రయ మౌలిక వసతుల అభివృద్ధి, కొత్త కనెక్టివిటీ అవకాశాలు, భవిష్యత్ అవసరాలపై అధికారులతో చర్చించారు. ఆంధ్రప్రదేశ్‌లో విమానయాన రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రామ్ మోహన్ నాయుడు తెలిపారు. రాష్ట్రంలోని ప్రధాన నగరాలు, పర్యాటక ప్రాంతాలకు మెరుగైన వైమానిక అనుసంధానం కల్పించడం ద్వారా అభివృద్ధికి ఊతమివ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతిపాదించిన "స్వర్ణ ఆంధ్ర" విజన్ సాధనలో విమానాశ్రయాల అభివృద్ధి కీలక పాత్ర పోషిస్తుందని మంత్రి పేర్కొన్నారు. మెరుగైన కనెక్టివిటీ ద్వారా పర్యాటకం, వాణిజ్యం, పెట్టుబడుల ప్రవాహం మరింత పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా విమానాశ్రయ మౌలిక సదుపాయాల విస్తరణ, సామర్థ్య పెంపు కార్యక్రమాలను వేగవంతం చేసి ప్రజలకు నాణ్యమైన సేవలు అందించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని అధికారులు ఈ సందర్భంగా వివరించారు.

# పరిశ్రమల ఖాళీ స్థలాలను హరిత వనాలుగా మార్చాలి: నాగబాబు



మంగళవారం సందర్శించిన నాగబాబు, అక్కడ చేపడుతున్న గ్రీన్‌బెల్ట్, ప్లాంటేషన్ కార్యక్రమాలను సమీక్షించారు. పరిశ్రమల పరిసరాల్లో స్థానిక వృక్ష జాతులతో విస్తృతంగా మొక్కలు నాటి పర్యావరణ సమతుల్యతను కాపాడాలని సూచించారు.పరిశ్రమలు కేవలం ఉత్పత్తి కార్యకలాపాలకే పరిమితం కాకుండా పర్యావరణ పరిరక్షణలో కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన పేర్కొన్నారు. గ్రీన్‌బెల్ట్ విస్తరణ ద్వారా వాతావరణ కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు జీవవైవిధ్యాన్ని పరిరక్షించవచ్చని తెలిపారు. మియావాకి విధానంలో దట్టమైన అటవీ ప్రాంతాలను అభివృద్ధి చేయడం ద్వారా తక్కువ స్థలంలో ఎక్కువ పచ్చదనాన్ని సృష్టించవచ్చని నాగబాబు వివరించారు. పరిశ్రమలు ఈ విధానాన్ని అనుసరించి విస్తృతంగా హరిత కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. అనంతరం సంస్థకు చెందిన 100 మందికి పైగా ఉద్యోగులతో కలిసి ఆయన మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, మొక్కలను నాటి సంరక్షించడం ద్వారా భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని పేర్కొన్నారు. గ్రీన్ ఆంధ్రప్రదేశ్ లక్ష్య సాధనలో పరిశ్రమల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని నాగబాబు అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న హరిత కార్యక్రమాలకు అన్ని వర్గాలు సహకరించి రాష్ట్రాన్ని మరింత పచ్చగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు.

# డిఎస్సీ స్పోర్ట్స్ కోటా అవకతవకలపై స్వతంత్ర సంస్థతో విచారణ

మద్దతు ప్రకటించింది, ఆరేళ్ల సర్వీసు పూర్తయిన వారికి స్పెషల్ గ్రేడ్ స్కేలు మంజూరు చేయాలని వార్షిక ఇంక్రిమెంట్లు నుండి కనీస నెలవేతనం రూ.30 వేలకు తగ్గకుండా అమలు చేయాలని కోరింది, సచివాలయ ఉద్యోగులకు నష్టం కలిగించే జిఓ నెంబర్ 11ను రద్దు చేయాలని, న్యాయమైన సచివాలయ ఉద్యోగుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం వారితో వెంటనే చర్చలు జరిపి పరిష్కరించాలని డిమాండ్ చేసింది.

**కానిస్టేబుల్ నియామకాలు వెంటనే చేపట్టాలి**

పోలీసు శాఖలో 19,999 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు వాటిని త్వరలోనే భర్తీ చేస్తామని గతంలో హోమ్ శాఖామాత్యులు ప్రకటించారని, ఇందులో 11,639 పోస్టులకు ఆర్థిక శాఖ అనుమతించినట్లు ప్రచారం జరిగిందని పేర్కొన్నారు. 1600 పోస్టులకు మాత్రమే ఇప్పుడు నోటిఫికేషన్ ఇవ్వడంపట్ల యువతలో తీవ్ర నిరసన, ఆగ్రహం వ్యక్తమవుతోందని, ప్రభుత్వం గతంలో ప్రకటించిన విధంగా సుమారు 20 వేల పోస్టులను తక్షణం భర్తీ చేయాలని సిపిఎం డిమాండ్ చేసింది. నిరుద్యోగుల ఆందోళనకు మద్దతు తెలిపింది.

**నిరుద్యోగులపై నిర్బంధానికి ఖండన**

కాకినాడలో ధర్నా చేసిన నిరుద్యోగులు, వారికి మద్దతుగా నిలబడ్డ ఎస్ఎఫ్ఐ , డివైఎఫ్ఐ నాయకులకు పోలీసులు నోటీసులిచ్చి వేధించడం, రాజా, సూరిబాబు, రాజేష్ సహా 20 మందిపై కేసులు బుక్ చేయడాన్ని సిపిఎం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. నిరుద్యోగులకు శిక్షణ ఇస్తున్న కోచింగ్ సెంటర్ యజమాని శ్యామ్‌ను బెదిరించడమే కాకుండా అక్రమ కేసు నమోదు చేయడం సరైంది కాదని తెలిపింది. వారిపై పెట్టిన కేసులు ఉపసంహరించుకోవాలని కోరింది.

## పదవులు ఎంత పెద్దవైనా పార్టీ కోసం అందరం కార్యకర్తలమే: నారా లోకేష్

**మంగళగిరి, సెప్టెంబర్ 8** : మంగ ళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాల యంలో నిర్వహిస్తున్న టీడీపీ లీడర్‌షిప్ ట్రైనింగ్ కాంక్లేవ్ రెండో రోజు కార్యక్రమంలో ఆత్మీయ వాతావరణం నెలకొంది. టీడీపీ జాతీయ కార్యని ర్వాహక అధ్యక్షుడు, రాష్ట్ర మంత్రి నారా లోకేష్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు కార్య కర్తల్లా సరదాగా ముచ్చటించుకుంటూ గడిపిన క్షణాలు పార్టీ శ్రేణులను ఆకట్టుకున్నాయి. నాయకత్వ బాధ్యతలు నిర్వహిస్తున్నప్పటికీ పార్టీ పట్ల తమ అనుబంధాన్ని చాటే విధంగా వారు వ్యవహరించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.కాంక్లేవ్ సందర్భంగా నాయకులు, కార్యకర్తల మధ్య మరింత సన్నిహిత సంబంధాలు ఏర్పడేలా పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ క్రమంలో నారా లోకేష్, పల్లా శ్రీనివాసరావు మధ్య జరిగిన సరదా సంభాషణ అందరి దృష్టిని ఆకర్షించింది. "పార్టీలో మనమూ కార్యకర్తలమే కదా" అనే భావనను వ్యక్తం చేస్తూ వారు గడిపిన ఆత్మీయ క్షణాలు టీడీపీ కుటుంబ ంలో ఐక్యతను ప్రతిబింబించాయని నాయకులు పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి కార్యకర్తలే పార్టీకి వెన్నెముకగా నిలిచారని నాయకులు గుర్తు చేశారు. పదవులు శాశ్వతం కావని, కానీ పార్టీ కోసం పనిచేసే కార్యకర్తల సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని అన్నారు. నాయకత్వ స్థానాల్లో ఉన్నవారు కూడా కార్యకర్తల భావజాలంతో పనిచేసినప్పుడే పార్టీ మరింత బలోపేతం అవుతుందని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా పార్టీ నిర్మాణంలో కార్యకర్తల పాత్రను ప్రత్యేకంగా ప్రస్తావించారు.రెండు రోజులుగా కొనసాగుతున్న లీడర్‌షిప్ ట్రైనింగ్ కాంక్లేవ్‌లో పార్టీ భవిష్యత్ కార్యాచరణ, సంస్థాగత బలోపేతం, ప్రజలతో అనుసంధానం, ప్రభుత్వ కార్యక్రమాల ప్రచారం వంటి అంశాలపై చర్చలు జరుగుతున్నాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, శ్రేణులు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. పార్టీ సిద్ధాంతాలు, నాయకత్వ నైపుణ్యాల పెంపు, సమన్వయంతో పనిచేసే విధానాలపై ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు.

# ఆరంభమే ఆశాజనకం.. చివరికి సంక్షోభం

ఈ మేరకు జిల్లా వ్యవసాయ, మైనర్ ఇరిగేషన్, భూగర్భ జల శాఖల అధికారిక గణాంకాలు ఈ సంక్షోభ తీవ్రతను తెలుపుతున్నాయి.

**జిల్లా వ్యవసాయ శాఖ ఉమ్మడి నివేదిక ప్రకారం...** జిల్లాలో మొత్తం సాధారణ సాగు విస్తీర్ణం 2,35,317 ఎకరాలు కాగా, ప్రస్తుత కరువు పరిస్థితుల వల్ల కేవలం 1,49,350 ఎకరాలు (63 శాతం) మాత్రమే సాగు ప్రారంభమైంది. సుమారు 37 శాతం భూములు సాగుకు నోచుకోలేదు. వరి సాధారణ సాగు విస్తీర్ణం 1,22,077 ఎకరాలు కాగా 66.005 ఎకరాల్లో (54 శాతం) మాత్రమే నాట్లు పడ్డాయి. పత్తి సాధారణ విస్తీర్ణం 85,142 ఎకరాలు కాగా 57,297 ఎకరాల్లో (67 శాతం) మాత్రమే సాగు చేశారు. వర్షాలు లేకపోవడంతో వేసిన పత్తి పంట కూడా దక్కలేదు. మొక్కజొన్న సాధారణ విస్తీర్ణం 14,317 ఎకరాలు కాగా 7765 ఎకరాల్లో (53 శాతం) పంట వేశారు. మినుములు 7332 ఎకరాలకు గానూ 5067 ఎకరాల్లో సాగు అయింది. నీటి వినియోగం తక్కువగా ఉండే పెసర పంట మాత్రం సాధారణ విస్తీర్ణం కంటే ఎక్కువగా 11917 ఎకరాలు (126 శాతం) సాగైంది. సాగు విస్తీర్ణం భారీగా పడిపోవడంతో వ్యవసాయ రంగంపై ఆధారపడిన లక్షలాది మంది వ్యవసాయ కార్మికులు రోడ్డున పడ్డారు.

**ఎండిపోయిన 291 చెరువులు**

జిల్లా పరిధిలోని మీడియం ఇరిగేషన్ ప్రాజెక్టులను గమనిస్తే... మున్నేరులో నీటి ప్రవాహం పూర్తిగా అడుగంటింది. గత ఏడాది ఇదే సమయానికి 0.13 టిఎంసి నీరుంది. ఎ.కొండూరు పరిధిలోని శ్రీ నందమూరి తారక రామారావు రిజర్వాయర్ ( 0.21 టిఎంసి) నిల్వలు కూడా అట్టడుగుకు చేరి మెట్ట ప్రాంత తాగునీటి సరఫరాకు కూడా సరిపోవడంలేదు. మైనర్ ఇరిగేషన్ శాఖ తాజా నివేదిక ప్రకారం జిల్లాలోని మొత్తం 439 మైనర్ ఇరిగేషన్ చెరువుల నిల్వ సామర్థ్యం 10,443.29 మిలియన్ క్యూబిక్ ఫీట్ (ఎంసిఎఫ్‌టి) కాగా ప్రస్తుతం కేవలం 1,779.97 ఎంసిఎఫ్‌టి (17 శాతం) నీరు మాత్రమే అందుబాటులో ఉంది. ఇందులో ఏకంగా 291 చెరువులు (0 శాతం నిల్వలు) పూర్తిగా ఎండిపోయి పగుళ్లు తీశాయి. జిల్లా మొత్తంలో 19 చెరువులు మాత్రమే వంద శాతం నిల్వతో ఉండగా, 75 శాతం నిల్వతో 20 చెరువులు, 50 శాతం నిల్వతో 53 చెరువులు, 25 శాతం నిల్వతో 56 చెరువులు మాత్రమే ఉన్నాయి. గ్రామాల్లోని చెరువులలో నీరు లేకపోవడం వల్ల పశుగ్రాసం, పశువుల తాగునీటికి కూడా గుక్కెడు నీరు లేదు.

**వేసవిని మించిన జల సంక్షోభం**

జిల్లావ్యాప్తంగా సగటు భూగర్భ జల మట్టం గత ఏడాది 3.71 మీటర్లుగా ఉండగా, ప్రస్తుతం 6.19 మీటర్ల లోతుకు పడిపోయింది. అంటే గడిచిన ఏడాది కాలంలోనే భూగర్భ జలాలు సగటున 2.48 మీటర్ల లోతుకు పడిపోయాయి. క్షేత్రస్థాయి పరిశీలనలో రెడ్డిగూడెం మండలంలో గత ఏడాది నీటి మట్టం 12.15 మీటర్ల లోతులో ఉండగా, ప్రస్తుతం అది 14.88 మీటర్ల లోతుకు పడిపోయింది. ఎ. కొండూరులో గత ఏడాది 3.20 మీటర్ల లోతులోనే నీరు లభించగా, ప్రస్తుతం ఏకంగా 8.91 మీటర్ల లోతుకు అడుగంటింది. విస్సన్నపేటలో గత ఏడాది 3.53 మీటర్ల వద్ద ఉన్న భూగర్భ జలాలు, ఇప్పుడు దాదాపు రెట్టింపు లోతుకు అంటే 6.97 మీటర్ల లోతుకు పడిపోయాయి. వర్షాకాలం ముగియక ముందే ఈ ప్రాంతాల్లో వేసవిని మించిన జల సంక్షోభం స్పష్టంగా కనిపిస్తోంది.

**ప్రకాశం బ్యారేజ్ మినహా అన్నీ నిల్**

విజయవాడ ప్రకాశం బ్యారేజ్ ప్రస్తుతం 3.07 టిఎంసిల పూర్తి సామర్థ్యంతో (100 శాతం) నిండు కుండలా ఉంది. ఎగువ నుండి 6,816 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, అంతే మొత్తాన్ని కాలువల ద్వారా సాగు, తాగునీటి అవసరాల కోసం దిగువకు విడుదల చేస్తున్నారు. బ్యారేజ్ నిండుగా ఉన్నప్పటికీ ఎగువన ఉన్న ఇతర ప్రధాన మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టుల్లో నీటి కొరత తీవ్రంగా ఉండటం వల్ల జిల్లాలోని అంతర్గత, మెట్ట ప్రాంతాలకు సాగునీరు అందడం లేదు. కృష్ణా బేసిన్ లోని శ్రీశైలం ప్రాజెక్ట్ మొత్తం 215.81 టిఎంసిల సామర్థ్యానికి గానూ ప్రస్తుతం (7.9.26) 134.250 టిఎంసిల నిల్వతో మాత్రమే ఉంది. గత ఏడాది ఇదే సమయానికి శ్రీశైలంలో 205.23 టిఎంసిల నీరు ఉంది. అలాగే నాగార్జున సాగర్ మొత్తం 312.05 టిఎంసిల సామర్థ్యానికి గానూ ప్రస్తుతం కేవలం 179.083 టిఎంసిలు మాత్రమే ఉన్నాయి. గత ఏడాది ఇదే సమయానికి సాగర్‌లో 300.32 టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎగువన ఉన్న ఈ ప్రధాన డ్యామ్‌లలో నీటి నిల్వలు తగ్గడం వల్ల కాలువలకు పూర్తి స్థాయిలో నీటి విడుదల జరగడం లేదు. ఇది రానున్న రబీ సాగుపై కూడా కోలుకోలేని దెబ్బ తీసే అవకాశం ఉంది.

**పడిపోయిన ఉపాధి - పెరిగిన ధరలు**

రోజువారీ పనులతో బిజీగా ఉండాల్సిన వ్యవసాయ కార్మికులు గ్రామాల్లో పని దొరకక ఖాళీగా ఉంటున్నారు. ఉపాధి హామీ పనులు కూడా ఆశించిన స్థాయిలో లేకపోవడంతో మెట్ట ప్రాంతాల నుండి నగరాలకు వలస బాట పడుతున్నారు. మరోవైపు, స్థానిక పంటల దిగుబడి తగ్గిపోతుందనే అంచనాలతో మార్కెట్లో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ముఖ్యంగా సాధారణ రకం బియ్యం, పప్పుధాన్యాలు, నూనెలు, నిత్యం వాడే కూరగాయల ధరలు సామాన్య కుటుంబాల బడ్జెట్‌ను దాటిపోతున్నాయి. ఒకవైపు చేతిలో పని లేక ఆదాయం పడిపోవడం, మరోవైపు మార్కెట్‌లె నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరగడంతో జిల్లా ప్రజలు కరవు కోరల్లో చిక్కుకుని అల్లాడిపోతున్నారు. తక్షణమే స్పందించి కరువు మండలాలను ప్రకటించాలని, నష్టపోయిన రైతాంగానికి, కార్మికులకు ప్రభుత్వ సహాయం అందించాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

**రూ.30 వేల వరకు నష్టం**

అరెకర సొంత పొలంతో పాటు మరో ఐదెకరాలు కౌలుకు తీసుకుని వరి నాట్లు వేశాను. ఇప్పుడు సాగునీరందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాను. మాకు చెరువు నీరే ఆధారం. వర్షాలు లేవు, కాల్వల్లో నీరు రావడం లేదు. వెంటనే వర్షం పడకపోతే నాకు మొత్తం రూ.30 వేల వరకు పెట్టుబడి నష్టం వస్తుంది. ఎంతో కష్టపడి వేసిన నాట్లు కళ్లముందే ఎండిపోతున్నాయి. అధికారులు వెంటనే స్పందించి సాగునీరందించి ఆదుకోవాలి.- వేముల హరికృష్ణ, రైతు, తిరువూరు

# స్థానిక ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలి

- పల్నాడు జిల్లా స్థాయి సమావేశం నిర్వహణ
- ఎన్నికల కార్యాచరణపై నేతలకు దిశానిర్దేశం
- గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతంపై దృష్టి
- ఇంటింటి ప్రచారానికి కార్యాచరణ ప్రకటింపు





**పల్నాడు, సెప్టెంబర్ 8 రాజధాని వాయిస్:** వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పల్నాడు జిల్లా స్థాయి సమావేశం ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహిం చారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పార్టీ భవిష్యత్ కార్యాచరణ, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన వ్యూహాలపై విస్తృతంగా చర్చించారు. జిల్లా వ్యాప్తంగా పార్టీని మరింత బలోపేతం చేయడంపై నాయకులకు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భం గా పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను పార్టీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజల్లోకి వెళ్లాలని సూచించారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ పార్టీ పట్ల ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించాలని నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. సెప్టెంబర్ 8 నుంచి 11వ తేదీ వరకు నియోజకవర్గ స్థాయి సమావేశాలు నిర్వహించాలని ఆయన తెలిపారు. అనంతరం సెప్టెంబర్ 12 నుంచి 22వ తేదీ వరకు మండల స్థాయి సమావే శాలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశాల ద్వారా పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేయడంతో పాటు కార్యకర్తలను ఎన్నికల కోసం సమాయత్తం చేయాలని పేర్కొన్నారు. సెప్టెంబర్ 23వ తేదీ నుంచి గ్రామాలు, వార్డుల్లో ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ప్రజలతో ప్రత్యక్షంగా మమేకమై వారి సమస్యలను తెలుసుకోవడంతో పాటు పార్టీ విధానాలను వివరించాలని కోరారు. గ్రామస్థాయిలో బూత్ కమిటీలను చురుకుగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచిం చారు. వైయస్ఆర్ సీపీ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు విస్తృతంగా వివరిం చాలని సమావేశంలో నిర్ణయించారు. అదే సమయంలో ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం అనుసరిస్తోందని పార్టీ ఆరోపిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకులకు సూచించారు. ప్రజలకు వాస్తవాలను వివరించే బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో నరసరావుపేట పార్లమెంట్ పరిశీలకుడు పూనూరు గౌతమ్ రెడ్డి, పల్నాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మాజీ మంత్రి విడదల రజిని, పెదకూరపాడు మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డితో పాటు నియోజకవర్గ పరిశీల కులు, జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. భవిష్యత్ కార్యాచరణపై పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు నాయకులు తెలిపారు.

# సోషల్ మీడియాను సీరియస్‌గా తీసుకోవాలి

- టీడీపీ నేతలకు మంత్రి నారా లోకేశ్ పిలుపు
- లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో రాజకీయ కమ్యూనికేషన్‌పై లోకేశ్ ప్రసంగం
- ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచన
- సెల్ఫీ వీడియోలతో వాస్తవాలు చెప్పాలని నేతలకు దిశానిర్దేశం
- దుష్ప్రచారాన్ని సోషల్ మీడియా వేదికగా తిప్పికొట్టాలని పిలుపు



**మంగళగిరి, సెప్టెంబర్ 8రాజధాని వాయిస్ :** తెలుగు దేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో జరుగుతున్న లీడర్‌షిప్ కాంక్లేవ్ రెండో రోజు కార్యక్రమంలో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ నేతలను ఉద్దేశించి కీలక ప్రసంగం చేశారు. “పొలిటికల్ కమ్యూనికేషన్ అండ్ పబ్లిక్ ఓరియంటేషన్” అంశంపై మాట్లాడిన ఆయన, ప్రస్తుత రాజకీయాల్లో సోషల్ మీడియా పాత్ర అత్యంత కీలకమైందని పేర్కొన్నారు. ప్రసంగం ప్రారంభంలోనే “మీలో ఎంతమంది సోషల్ మీడియాను చురుకుగా వినియోగిస్తు న్నారు?” అని ప్రశ్నిస్తూ నేతల దృష్టిని ఆ అంశంపై కేంద్రీకరిం చారు. సోషల్ మీడియాను సాధారణ వేదికగా భావించకుండా అత్యంత బాధ్యత తో వినియోగించాలని లోకేశ్ సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు వేగంగా చేరాలంటే సామాజిక మాధ్యమాలను సమర్థవం తంగా ఉపయోగిం చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామ, మండల స్థాయి నుంచి కార్పొరేషన్, ఏఎంసీ ఛైర్మన్ల వరకు అందరూ తమ పనితీరును ప్రజలకు తెలియజేయడానికి సోషల్ మీడియాను వినియోగిస్తున్నా రని చెప్పారు. ప్రజలతో నేరుగా కమ్యూనికేషన్ ఏర్పరచుకోవడానికి సెల్ఫీ వీడియోలు మంచి సాధనంగా మారాయని లోకేశ్ పేర్కొన్నా రు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ కూడా తరచూ వీడియోల ద్వారా ప్రజలతో తన అభిప్రాయాలను పంచుకుంటున్నారని గుర్తుచేశారు. తాను కూడా సుజ్లాన్ విండ్ ప్రాజెక్టు శంకుస్థాపన, డీఎస్సీ అంశాలపై జరుగుతున్న ప్రచారానికి సంబంధించిన విషయాలను సెల్ఫీ వీడియోల ద్వారా ప్రజలకు వివరించానని తెలిపారు. ప్రజలకు వాస్తవాలను చేరవేయడం ప్రతి నాయకుడి బాధ్యత అని అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలపై సరైన సమాచారం ప్రజలకు అందకపోతే అపోహలు పెరిగే ప్రమాదం ఉందని లోకేశ్ అభిప్రాయపడ్డారు. అందుకే ప్రతి నాయకుడు తన పరిధిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ఫొటోలు, వీడియో లు, పోస్టుల రూపంలో ప్రజలకు చేరవేయాలని సూచించా రు. ప్రజల తో నిరంతర సంబంధాలు కొనసాగించేందుకు సోషల్ మీడియా సమర్థమైన సాధనంగా మారిందని పేర్కొన్నారు. ప్రతిపక్షా ల వైఖరిపై కూడా ఆయన విమర్శలు గుప్పించారు. ప్రతిపక్షాలు ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం, దుష్ప్రచారం చేయడానికే పరిమితమవుతున్నాయని అన్నారు. అలాంటి ప్రచారాలను వాస్తవాలతో తిప్పికొట్టేందుకు టీడీపీ నాయకులు సిద్ధంగా ఉండాల ని పిలుపునిచ్చారు. వాస్తవ ఆధారాలతో ప్రజల్లోకి వెళ్లడం ద్వారానే విశ్వసనీయత పెరుగుతుందని పేర్కొన్నారు. అమరావతి అభివృద్ధి సహా కూటమి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను మరింత బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని లోకేశ్ దిశానిర్దే శం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సాంకేతికతను సమర్థం గా వినియోగిస్తూ ప్రజలతో అనుసంధానమై ఉండాలని సూచిం చారు. రాబోయే రోజుల్లో రాజకీయ కమ్యూనికేషన్‌లో సోషల్ మీడియా మరింత కీలక పాత్ర పోషించనుందని, అందుకు అనుగు ణంగా ప్రతి నాయకుడు తనను తాను తీర్చిదిద్దుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

# ‘జయహో బీసీ’ సభకు ముస్తాబైన నర్సీపట్నం

- యువత ఫ్లాష్‌మాబ్‌తో ఆకట్టుకున్న బీసీ సభ ప్రచారం
- ప్రధాన కూడళ్లలో సందడి చేసిన యువకులు
- పట్టణమంతా పచ్చ తోరణాలు, భారీ కటౌట్లతో అలంకరణ
- సెప్టెంబర్ 9న ఎన్టీఆర్ స్టేడియంలో భారీ బహిరంగ సభ







**నర్సీపట్నం, సెప్టెంబర్ 8 రాజధాని వాయిస్ :** నర్సీపట్నంలో నిర్వహించ నున్న ‘జయహో బీసీ’ భారీ బహిరంగ సభకు ముందు పట్టణంలో సందడి వాతావరణం నెలకొంది. సభను పురస్కరిం చుకుని స్థానిక యువత నిర్వహించిన ఫ్లాష్‌మాబ్ కార్యక్రమం నగరవాసులను విశేషంగా ఆకట్టుకుంది. బీసీ సభ కోసం ప్రత్యేకంగా రూపొం దించిన పాటకు యువకులు ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ ప్రజల దృష్టిని ఆకర్షించారు. ఈ కార్యక్రమం సభపై ప్రజల్లో ఆసక్తిని మరింత పెంచింది. పట్టణంలోని శ్రీకన్య కూడలి, పాల్‌గాట్ సెంటర్ ప్రాంతాల్లో యువత ఫ్లాష్‌మాబ్ నిర్వహించారు. సంగీతానికి అనుగుణంగా చేసిన నృత్య ప్రదర్శనలు అక్కడి ప్రజలను ఆకట్టుకున్నాయి. ప్రధాన కూడళ్లలో యువకులు చేసిన వినూత్న ప్రచారం కారణంగా రాబోయే సభపై చర్చ మరింత పెరిగింది. కార్యక్రమాన్ని వీక్షించేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. మరోవైపు ‘జయహో బీసీ’ సభ కోసం నర్సీపట్నం పట్టణం సర్వాంగ సుందరంగా ముస్తాబవుతోంది. ప్రధాన రహదారులు, కూడళ్లను పచ్చ తోరణాలు, భారీ కటౌట్లతో అలంకరించారు. సభకు వచ్చే నాయకులు, కార్యకర్తలు, ప్రజలను ఆకట్టుకునేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. పట్టణమంతా పండుగ వాతావరణాన్ని తలపించేలా అలంకరణలు కనిపిస్తున్నాయి. పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ చిత్రాలతో పాటు బీసీ సభ లోగోతో ఏర్పాటు చేసిన భారీ బెలూన్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆకాశంలో ఎగురుతున్న ఈ బెలూన్లు ప్రజల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. సభ ప్రాధాన్యతను చాటిచెప్పేలా ప్రచార కార్యక్రమాలు విస్తృతంగా కొనసాగుతు న్నాయి. సెప్టెంబర్ 9వ తేదీ బుధవారం నర్సీపట్నంలోని ఎన్టీఆర్ స్టేడియంలో మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు ‘జయహో బీసీ’ సభ నిర్వహించనున్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు, బీసీ వర్గాల ప్రతినిధులు హాజరయ్యే అవకాశం ఉందని నిర్వాహకులు చెబుతున్నారు. సభను విజయవంతం చేసేం దుకు విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నారు. సభ నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని ఏర్పాట్లను ముమ్మరంగా పూర్తి చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. స్టేడియంలో తాగునీరు, పార్కింగ్, భద్రత, కూర్చునే సదుపాయాల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించారు. భారీ సంఖ్యలో ప్రజలు హాజరుకానున్న నేపథ్యంలో అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేస్తూ ఏర్పాట్లను తుది దశకు తీసుకెళ్తున్నాయి.

# వీసా మోసం కేసులో యూట్యూబర్ రమానందనకు చిక్కులు

- ఇబ్రహీంపట్నం పోలీసుల విచారణకు హాజరు
- రూ.13 లక్షలు వసూలు చేసి మోసం చేశారన్న ఆరోపణలు
- అద్దంకిలోనూ మరో వీసా స్కామ్ కేసు నమోదు
- బాధితుల ఫిర్యాదులతో ముమ్మరమైన దర్యాప్తు



**హైదరాబాద్/ప్రకాశం జిల్లా, సెప్టెంబర్ 8 రాజధాని వాయిస్ :** విదేశాల్లో ఉద్యోగాలు, వీసాలు ఇప్పిస్తామంటూ డబ్బులు వసూలు చేసి మోసం చేశారన్న ఆరోపణలతో ప్రముఖ యూట్యూ బర్ రమానం దన వివాదంలో చిక్కుకున్నారు. ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో నమోదైన వీసా చీటింగ్ కేసులో ఆమె మంగళవారం తన న్యాయవా దులతో కలిసి పోలీసుల ఎదుట విచారణకు హాజరయ్యారు. బాధితుల ఫిర్యాదుల ఆధారంగా కేసు నమోదు చేసిన పోలీసులు ఇప్పటికే దర్యాప్తు ప్రారంభించగా, ఈ వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. బాధితుడు క్రాంతి కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రమానందన దంపతులు విదేశాల్లో ఉద్యోగం ఇప్పిస్తామని హామీ ఇచ్చి తన వద్ద నుంచి రూ.13 లక్షలు వసూలు చేశారని ఆరోపణ లు వచ్చాయి. అయితే చెప్పినట్లుగా ఉద్యోగం కల్పించకపోవడంతో పాటు డబ్బులు కూడా తిరిగి ఇవ్వలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన వివరాలను సేకరిస్తున్నారు. ఈ కేసు విచారణలో భాగంగా యూకే నుంచి హైదరాబాద్‌కు వచ్చిన వెంటనే పోలీసుల ఎదుట హాజరుకావాలని రమానందనకు నోటీసు లు జారీ చేశారు. నోటీసుల మేరకు ఆమె ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌కు చేరుకుని విచారణలో పాల్గొన్నారు. కేసుకు సంబంధించిన పలు అంశాలపై అధికారులు ప్రశ్నలు అడిగి వివరణ తీసుకున్నట్లు సమాచారం. విచారణ అనంతరం పోలీసులు మరిన్ని ఆధారాలను పరిశీలిస్తున్న ట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా ప్రకాశం జిల్లా అద్దంకి పోలీస్ స్టేషన్‌లో కూడా రమానందనపై మరో కేసు నమోదు కావడం సంచలనంగా మారింది. ‘డెస్టినీ కన్సల్టెన్సీ’ పేరుతో వీసా రెన్యువల్, సర్టిఫికెట్ ఆఫ్ స్పాన్సర్‌షిప్ ఇప్పిస్తామని నమ్మించి 2023లో భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేశారని పలువురు బాధితులు ఆరోపించారు. ఈ మేరకు అద్దంకి పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. వరుస కేసులు నమోదవు తుండటంతో మరికొంత మంది బాధితులు కూడా ముందుకు వస్తున్నట్లు సమాచారం. హైదరాబాద్‌తో పాటు ప్రకాశం జిల్లాకు చెందిన బాధితులు తమ ఫిర్యాదులను నమోదు చేసేందుకు ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయిస్తున్నారు. బాధితుల వాంగ్మూలాలను నమోదు చేస్తున్న పోలీసులు కేసుల మధ్య ఉన్న సంబంధాలను కూడా పరిశీలిస్తున్నారు. రమానందనపై నమోదైన ఆరోపణల నేపథ్యంలో దర్యాప్తు మరింత విస్తరించే అవకాశాలు కనిపిస్తున్నాయి. విదేశీ ఉద్యోగాలు, వీసాల పేరుతో జరిగిన లావాదేవీలు, కన్సల్టెన్సీ కార్యకలాపాలు, బాధితుల నుంచి వసూలు చేసిన మొత్తాలపై అధికారులు లోతుగా విచారణ చేస్తున్నారు. విచారణలో లభించే ఆధారాల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి.

# కొత్త పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ

- పాల్గొన్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు
- ఆకివీడు మండలంలోని అయి భీమవరం గ్రామంలో కార్యక్రమం
- ప్రభుత్వ రాజముద్రతో కొత్త పాసు పుస్తకాల అందజేత
- రాజకీయ నాయకుల ఫోటోలు లేకుండా పంపిణీ



**పశ్చిమ గోదావరి జిల్లా, సెప్టెంబర్ 8 రాజధాని వాయిస్ :** ఆంధ్రప్రదేశ్ శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు మంగళవారం ఆకివీడు మండలంలోని తన స్వగ్రామం అయి భీమవరం గ్రామంలో నిర్వహించిన కొత్త పట్టాదారు పాసు పుస్తకాల ఉచిత పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులకు కొత్త పట్టాదారు పాసు పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో మాట్లాడుతూ రైతుల భూ హక్కులకు మరింత భరోసా కల్పించే విధంగా ప్రభుత్వం కొత్త పట్టాదారు పాసు పుస్తకాలను రూపొందించిందన్నారు. గతంలో మాదిరిగా రాజకీయ నాయకుల ఫోటోలు కాకుండా ప్రభుత్వ రాజముద్రతో కూడిన పాసు పుస్తకాలను అందజేయడం పారదర్శక పాలనకు నిదర్శనమని పేర్కొన్నారు. రైతుల భూ రికార్డులను కచ్చితంగా నమోదు చేసి, భూములకు సంబంధించిన వివరాలను సులభంగా అందుబాటులో ఉంచే లక్ష్యంతో ఈ కొత్త పాసు పుస్తకాలను రూపొందించినట్లు తెలిపారు. భూ సంబంధిత వివాదాలను తగ్గించడంతో పాటు రైతులకు అవసరమైన సేవలను వేగంగా అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, భూ రికార్డుల ప్రక్షాళన, ఆధునీకరణ ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తోందని డిప్యూటీ స్పీకర్ వెల్లడించారు. రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని వ్యవసాయాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కొత్త పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీతో రైతుల్లో ఆనందం వ్యక్తమైంది.

# పార్వతీపురం మన్యం జిల్లాలో వైయస్ఆర్ సీపీ విస్తృత స్థాయి సమావేశం

- స్థానిక సంస్థల ఎన్నికలపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం
- జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్ రాజు అధ్యక్షతన సమావేశం
- సమన్వయంతో పనిచేయాలని కార్యకర్తలకు సూచన
- పెద్ద సంఖ్యలో హాజరైన పార్టీ నాయకులు



**పార్వతీపురం రాజధాని వాయిస్ :** వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్వతీపురం మన్యం జిల్లా వైయస్ఆర్ సీపీ విస్తృత స్థాయి సమావేశం మంగళవారం నిర్వహించారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్ రాజు అధ్యక్షతన పార్వతీపురంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో జరిగిన ఈ సమావేశానికి పార్టీకి చెందిన పలువురు ముఖ్య నాయకులు హాజరయ్యారు. రానున్న స్థానిక సంస్థలు, మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పార్టీ కార్యాచరణపై చర్చించారు. సమావేశానికి మాజీ ఉప ముఖ్యమంత్రులు పీడిక రాజన్న దొర, పాముల పుష్ప శ్రీవాణి ముఖ్య అతిథులుగా హాజర య్యారు. అలాగే జిల్లా పరిశీలకుడు శరగడం చిన్న అప్పలనా యుడు, శాసనమండలి సభ్యుడు పాలవలస విక్రాంత్ బాబు, మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు, నియోజకవర్గ పరిశీలకులు మరిసర్ల బాపూజీ నాయుడు, జమ్మన ప్రసన్న కుమార్, మావుడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ బాబు, స్థానిక సంస్థలు మరియు మున్సిపల్ ఎన్నికలకు పార్టీ శ్రేణులు పూర్తిస్థాయిలో సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. గ్రామ, మండల, పట్టణ స్థాయిలో కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి లోపాలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. పార్టీ బలోపేతానికి ప్రతి నాయకుడు, కార్యకర్త బాధ్యతగా పనిచేయాలని విక్రాంత్ బాబు సూచించారు. స్థానిక స్థాయిలో ఎదురయ్యే సమస్యలను వెంటనే జిల్లా పార్టీ కమిటీ దృష్టికి తీసుకురావాలని కోరారు. పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లేందుకు కార్యాచరణ రూపొందించు కోవాలని అన్నారు. రానున్న ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు ఐక్యంగా పనిచేయాలని నాయకులు పిలుపునిచ్చారు. గత ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని, పార్టీ సిద్ధాంతాలను గ్రామస్థాయికి తీసుకె ళ్లాలని సూచించారు. ప్రజలతో నిరంతరం మమేకమై వారి సమస్యలను తెలుసుకోవాలని నాయకత్వం సూచించింది. ఈ సమావేశంలో రాష్ట్ర, జిల్లా స్థాయి పార్టీ కమిటీ సభ్యులు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, మండల పార్టీ అధ్యక్షులు, ఎంపీపీలు, జడ్పీటీ సీలు, మాజీ కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, కార్యక ర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయా నికి సమిష్టిగా కృషి చేయాలని సమావేశంలో నిర్ణయించారు.

## వైఎస్ జగన్‌ను కలిసిన విడదల రజిని, సింగారెడ్డి కోటిరెడ్డి



తాడేపల్లి.సెప్టెంబర్ 08రాజధాని వాయిస్ :వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని మాజీ మంత్రి విడదల రజిని, చిలకలూరిపేట నియోజకవర్గ పార్టీ నాయకుడు సింగారెడ్డి కోటిరెడ్డి తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో కలిశారు. నాదెండ్ల పోలీసులు నమోదు చేసిన కేసులో ఇటీవల బెయిల్‌పై విడుదలైన కోటిరెడ్డి, తమపై రాజకీయ వేధింపులు సాగుతున్నాయని, తప్పుడు కేసులు బనాయిస్తున్నారని విడదల రజినితో కలిసి జగన్ దృష్టికి తీసుకెళ్లారు. పూర్తి వివరాలు తెలుసుకున్న జగన్, ఎలాంటి పరిస్థితులకైనా అధైర్యపడవద్దని, పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

## మాజీ ఎమ్మెల్యే మహేష్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన హరికష్ణ



పిడుగురాళ్ళ.సెప్టెంబర్ 08,రాజధాని వాయిస్ : గురజాల నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డికి గురజాల నియోజకవర్గ సోషల్ మీడియా ప్రెసిడెంట్ బత్తుల హరికృష్ణ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, ప్రజా నాయకుడు కాసు మహేష్ రెడ్డి నిండు నూరేళ్ళు ఆరోగ్యంగా జీవిస్తూ,భవిష్యత్ లో ఎన్నో ఉన్నత పదవులు పొందాలని, ఆ భగవంతుడి కృప ఎల్లవేళలా కాసు మహేష్ రెడ్డిపై ఉండాలని కోరుకుంటున్నానన్నారు.

## కాసు మహేష్ రెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన మాజీ సర్పంచ్ శివారెడ్డి




పిడుగురాళ్ల.సెప్టెంబర్ 08రాజధాని వాయిస్ :గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి జన్మదినం సందర్భంగా అయ్యప్ప నగర్ మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు గొట్టిముక్కల శివారెడ్డి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శివారెడ్డి మాట్లాడుతూ, మహేష్ రెడ్డి హయాంలో నియోజకవర్గంలో మెడికల్ కాలేజ్, బైపాస్ రోడ్డు నిర్మాణం, దాచేపల్లి, గురజాల మునిసిపాలిటీల ఏర్పాటు వంటి ఎన్నో అభివృద్ధి పనులు జరిగాయని గుర్తుచేశారు. ఆయన ఆయురారోగ్యాలతో వర్ధిల్లి, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు.

## అక్షరాస్యతతోనే జ్ఞాన సమాజ నిర్మాణం మెట్టు గోవిందరెడ్డి



మాచర్ల.సెప్టెంబర్ 08రాజధాని వాయిస్ :అక్షరాస్యతతోనే జ్ఞాన సమాజ నిర్మాణం సాధ్యమని మాచర్ల మండల న్యాయ సేవా కమిటీ, పల్నాడు జిల్లా దిశ కమిటీ సభ్యుడు మెట్టు గోవిందరెడ్డి అన్నారు. అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా మాచర్ల పట్టణంలోని కస్తూర్బా పాఠశాలలో మండల న్యాయ సేవా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు.అక్షరమే ఒక ఆయుధమని, విద్య వ్యక్తిగత ప్రగతికే కాక దేశాభివృద్ధికి కీలకమని పేర్కొన్నారు. సెలవుల్లో విద్యార్థులు తమ గ్రామాల్లోని నిరక్షరాస్యులను గుర్తించి, కనీసం ఒక్కరినైనా అక్షరాస్యుడిగా తీర్చిదిద్దే బాధ్యత తీసుకుని రాయబారులుగా మారాలని పిలుపునిచ్చారు. ఒక్క సిరా చుక్క లక్షలాది మెదళ్లను కదిలించే శక్తిని కలిగి ఉంటుందని, స్వామి వివేకానంద సూక్తులను స్ఫూర్తిగా తీసుకుని విద్యతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది రామ్ నాయక్, న్యాయవాది పుల్లారావు, పాఠశాల ప్రిన్సిపాల్ కవిత, పీఈటీ,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గడపగడపకు వైయస్ఆర్ సీపీ కార్యక్రమం

- పాల్గొన్న పిల్లి సుభాష్ చంద్రబోస్, పిల్లి సూర్యప్రకాష్
- 26, 27వ వార్డుల్లో ఇంటింటి పర్యటన
- ప్రజల సమస్యలు తెలుసుకున్న నాయకులు
- అభివృద్ధికి కృషి చేస్తామని హామీ
- మున్సిపల్ ఎన్నికలకు పార్టీ శ్రేణుల సన్నద్ధత



రామచంద్రపురం, సెప్టెంబర్ 8 రాజధాని వాయిస్ రామచంద్రపురం పట్టణంలోని 26, 27వ వార్డుల్లో మంగళవారం నిర్వహించిన గడపగడపకు వైయస్ఆర్ సీపీ కార్యక్రమంలో మాజీ రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్, వైయస్ఆర్ సీపీ రామచ ంద్రపురం నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్ పాల్గొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి వార్డుల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలు, ప్రజల అవసరాలపై నేరుగా ఆరా తీశారు. ప్రజలతో ముఖాముఖి మాట్లాడిన పిల్లి సూర్యప్రకాష్, వార్డుల్లో ఎదురవుతున్న వివిధ సమస్యలను తెలుసుకున్నారు. తాగునీరు, పారిశుధ్యం, రహదారులు, వీధి దీపాలు తదితర అంశాలపై స్థానికులు చేసిన వినతులను స్వీకరించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. 26, 27వ వార్డుల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతామని పిల్లి సూర్యప్రకాష్ తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టేందుకు తమ వంతు ప్రయత్నం చేస్తామని పేర్కొన్నారు. స్థానిక సమస్యల పరిష్కారంలో నిరంతరం ప్రజలతో కలిసి పనిచేస్తామని చెప్పారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పార్టీ కార్యకర్తలు మరింత చురుకుగా పనిచేయాలని నాయకులు సూచించారు. వైయస్ఆర్ సీపీ అభ్యర్థులను గెలిపిస్తే వార్డుల అభివృద్ధికి మరింత ప్రాధాన్యత ఇస్తామని ప్రజలకు వివరించారు. ప్రజా సమస్యల పరిష్కారం, మౌలిక సదుపాయాల కల్పన కోసం కృషి చేస్తామని తెలిపారు. మాజీ రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ కూడా ప్రజలను కలుసుకుని వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ప్రజల సమస్యలను పార్టీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తామని పేర్కొన్నారు. ప్రజలతో నిరంతర సంబంధాలు కొనసాగించడం ద్వారా వారి అవసరాలను అర్థం చేసుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో వైయస్ఆర్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వార్డుల్లో పార్టీ కార్యకలాపాలను మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజలతో మమేకమవుతూ ముందుకు సాగాలని నాయకులు పిలుపునిచ్చారు. గడపగడపకు వైయస్ఆర్ సీపీ కార్యక్రమానికి స్థానికుల నుంచి మంచి స్పందన లభించినట్లు పార్టీ నాయకులు తెలిపారు.

# ఏపీ పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో కర్నూలు రేంజ్ ఘన విజయం

- మొత్తం 86 పతకాలు సాధించిన క్రీడాకారులు
- మహిళల విభాగంలో ప్రథమ స్థానం
- పురుషుల విభాగంలో ద్వితీయ స్థానం
- విజేతలను అభినందించిన డీఐజీ కోయ ప్రవీణ్



కర్నూలు, సెప్టెంబర్ 8 రాజధాని వాయిస్ ఏపీ పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో కర్నూలు రేంజ్ పోలీసు క్రీడాకారులు అద్భుత ప్రతిభ కనబర్చి ఘన విజయాన్ని సొంతం చేసుకున్నారు. వివిధ క్రీడా విభాగాల్లో పోటీపడిన క్రీడాకారులు మొత్తం 86 పతకాలను సాధించి రేంజ్‌కు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారు. ఈ విజయంతో కర్నూలు రేంజ్ పోలీసు విభాగంలో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి. పోటీల్లో మహిళా క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి మహిళల విభాగంలో ప్రథమ స్థానం సాధించారు. వివిధ ఈవెంట్లలో ప్రతిభను చాటుతూ పలు స్వర్ణ, రజత, కాంస్య పతకాలను కైవసం చేసుకున్నారు. వారి కృషి, పట్టుదల ఈ విజయానికి ప్రధాన కారణమని అధికారులు పేర్కొన్నారు.పురుషుల విభాగంలో కూడా కర్నూలు రేంజ్ క్రీడాకారులు సత్తా చాటారు. పలు విభాగాల్లో పోటీ పడుతూ మొత్తం పతకాల పట్టికలో ద్వితీయ స్థానాన్ని దక్కించుకున్నారు. క్రమశిక్షణ, నిరంతర సాధనతో ఈ విజయాన్ని సాధించారని అధికారులు తెలిపారు. పోలీసు విధులతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరచడం అభినందనీయమని అధికారులు పేర్కొన్నారు. శారీరక దారుఢ్యం, మానసిక ధైర్యాన్ని పెంపొందిం చడంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. ఈ విజయా లు ఇతర సిబ్బందికి కూడా స్ఫూర్తిగా నిలుస్తాయని అభిప్రాయ పడ్డారు.విజేతలను కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ ఐపీఎస్ ప్రత్యేకంగా అభినందించారు. క్రీడాకారుల కృషి, అంకితభావం వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని కొనియాడారు. భవిష్య త్తులో కూడా ఇదే ఉత్సాహంతో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విజేతలకు శుభాకాంక్షలు తెలియజేసిన డీఐజీ, రాష్ట్ర స్థాయిలో కర్నూలు రేంజ్‌కు మంచి పేరు తీసుకువచ్చినందుకు క్రీడాకారులను అభినందించారు. పోలీసు శాఖలో క్రీడలను మరింత ప్రోత్సహించేందుకు అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. క్రీడాకారుల విజయాలతో కర్నూలు రేంజ్ పోలీసు విభాగం గర్వపడుతోందని పేర్కొన్నారు.

# ఎన్‌టీఆర్ విద్యాసంస్థలను సందర్శించిన ట్రస్ట్ సీఈఓ

- విద్యార్థులతో మమేకమైన మాజీ ఐపీఎస్ అధికారి
- విద్యా పురోగతిపై ఆరా
- మౌలిక సదుపాయాల పరిశీలన
- ఆహార నాణ్యత, పరిశుభ్రతపై సమీక్ష



గండిపేట, సెప్టెంబర్ 8 రాజధాని వాయిస్ : ఎన్‌టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ సీఈఓ, మాజీ ఐపీఎస్ అధికారి కె. రాజేంద్ర కుమార్ గండిపేట లోని ఎన్‌టీఆర్ విద్యాసంస్థలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల, కళాశాల విద్యార్థులతో మమేకమై వారి విద్యాభ్యాసం, లక్ష్యాలు, విద్యా పురోగతి గురించి తెలుసుకున్నారు. విద్యార్థులను ప్రోత్సహిస్తూ ఉన్నత లక్ష్యాల సాధనకు కృషి చేయాలని సూచించారు. సందర్శన సందర్భంగా విద్యార్థులతో ఆప్యాయంగా మాట్లాడిన రాజేంద్ర కుమార్, చదువుపై పూర్తి దృష్టి సారించాలని సూచించారు. భవిష్యత్ లక్ష్యాల సాధనలో క్రమశిక్షణ, అంకిత భావం ఎంతో అవసరమని వివరించారు. విద్యార్థుల అభిప్రా యాలు, రోజువారీ అభ్యసన అనుభవాల గురించి కూడా అడిగి తెలుసుకున్నారు.అనంతరం విద్యాసంస్థల ప్రాంగణంలోని తరగతి గదులు, అధ్యయన కేంద్రాలు, ఇతర మౌలిక సదుపాయాలను పరిశీలించారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు అందుబాటులో ఉన్న సౌకర్యాలపై సమీక్ష నిర్వహిం చారు. విద్యా ప్రమాణాలు నిరంతరం ఉన్నత స్థాయిలో కొనసాగేం దుకు అవసరమైన సూచనలు చేశారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహార నాణ్యత, పరిశుభ్రతపై కూడా ప్రత్యేక దృష్టి సారించారు. వంటశాలలు, ఆహార సరఫరా విధానాలను పరిశీలించి ఆరోగ్యకరమైన, పోషకాహారంతో కూడిన భోజనం అందుతున్నదా అనే విషయాన్ని పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్యం, సంక్షేమం విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. ఎన్‌టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ విద్యతో పాటు విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని రాజేంద్ర కుమార్ తెలిపారు. విద్య, ఆరోగ్యం, వ్యక్తిత్వ వికాసం వంటి అంశాల్లో సంస్థలు మరింత మెరుగైన సేవలు అందించాలని సూచించారు. విద్యార్థుల భవిష్యత్ నిర్మాణంలో విద్యాసంస్థల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, సిబ్బందితో కూడా ఆయన సమావే శమయ్యారు. విద్యా ప్రమాణాల పెంపు, విద్యార్థుల సంక్షేమానికి చేపడుతున్న చర్యలపై వివరాలు తెలుసుకున్నారు. నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థుల శ్రేయస్సుకు ఎన్‌టీఆర్ ట్రస్ట్ కట్టుబడి ఉందని ఆయన పునరుద్ఘాటించారు.

# తూపిలిపాలెంలో వినాయక నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

- నిమజ్జన ప్రదేశాన్ని సందర్శించిన అధికారులు
- భద్రత, సౌకర్యాలపై సమీక్ష
- పోలీసు, రెవెన్యూ శాఖల సంయుక్త తనిఖీ
- ప్రశాంతంగా ఉత్సవాలు నిర్వహించాలని సూచన



వాకాడు, సెప్టెంబర్ 8 రాజధాని వాయిస్ : వినాయక నిమజ్జనోత్సవాల సందర్భంగా తూపిలిపాలెంలో చేపట్టిన ఏర్పాట్లను అధికారులు మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వాకాడు పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఆధ్వర్యంలో ఎంఆర్‌ఓ, ఎంపీడీఓ అధికారులతో కలిసి నిమజ్జన ప్రదేశాన్ని సందర్శించి పరిస్థితులను సమీక్షించారు. ఈ సందర్భంగా నిమజ్జన కార్యక్రమాలు జరిగే ప్రాంతంలో భద్రతా ఏర్పాట్లు, ప్రజలకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులకు సూచనలు చేశారు.నిమజ్జన ప్రదేశంలో రాకపోకల నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ, అత్యవసర పరిస్థితుల నిర్వహణకు సంబంధించిన అంశాలను కూడా అధికారులు సమీక్షించారు. ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. నిమజ్జన కార్యక్రమాల్లో పాల్గొనే భక్తులు పోలీసుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని అధికారులు కోరారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.పోలీసు, రెవెన్యూ, స్థానిక సంస్థల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

## కలెక్టర్‌ల సమావేశ ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్



గుంటూరు.సెప్టెంబర్ 08రాజధాని వాయిస్ : ఈ నెల 10, 11 తేదీల్లో జరగనున్న జిల్లా కలెక్టర్ ల సమావేశ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ మంగళవారం పరిశీలించారు.జిల్లా కలెక్టర్ ల సమావేశం వెలగపూడిలో రాష్ట్ర సచివాలయంలో జరగనుంది. అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలలో ఎక్కడా లోపాలు లేకుండా నిర్వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రోటోకాల్ డైరెక్టర్ మోహన్ రావు, గుంటూరు రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాస రావు, తెనాలి రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీరమణి, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలి కలెక్టర్ కృతికా శుక్లా



నరసరావుపేట.సెప్టెంబరు 08 రాజధాని వాయిస్ : జిల్లాలో రహదారి ప్రమాదాల నివారణకు, ప్రజల ప్రాణాల రక్షణకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పటిష్ట చర్యలు తీసుకోవాలని పల్నాడు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో ఆమె అధ్యక్షతన జిల్లా రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశం జరిగింది. ఇటీవల చిలకలూరిపేట పురుషోత్తంపట్నం జంక్షన్ వద్ద ఆటో, ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొని ఎనిమిది మంది మృతి చెంది, ఆరుగురు గాయపడిన ఘటనపై రవాణా, ఆర్ అండ్ బి, జాతీయ రహదారులు, పోలీస్, మున్సిపల్ అధికారులతో కలెక్టర్ సమగ్ర సమీక్ష నిర్వహించారు.ప్రమాద స్థలానికి సంబంధించిన వివరాలను అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్‌కు వివరించారు. చిలకలూరిపేట హైవే పరిధిలో గుర్తించిన ఐదు హాట్‌స్పాట్లు, నాలుగు బ్లాక్ స్పాట్ల వద్ద చేపడుతున్న భద్రతా చర్యలను అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. పురుషోత్తంపట్నం, ఎన్నార్టీ జంక్షన్ల వద్ద రహదారి ఆక్రమణలతో పాటు డివైడర్లపై ఉన్న అడ్వర్టైజ్మెంట్ బోర్డులను వెంటనే తొలగించాలని, ఇందుకోసం ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేయాలని చిలకలూరిపేట ఆర్డీవోను కలెక్టర్ ఆదేశించారు. అలాగే పురుషోత్తంపట్నం, ఎన్నార్టీ, విజయ బ్యాంక్, ఏఎమ్‌జీ, బస్టాండ్ సెంటర్లలో తక్షణమే హైమాస్ట్ లైట్లు, ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. ప్రమాదాలు జరిగే ప్రాంతాలను తక్షణమే బ్లాక్ స్పాట్లుగా గుర్తించి శాశ్వత నివారణ చర్యలు చేపట్టాలని, వాహనదారులకు రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కల్పించాలని పోలీస్, రవాణా శాఖల అధికారులను ఆదేశించారు.

## పులివెందులలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై ప్రత్యేక తనిఖీలు



పులివెందుల, సెప్టెంబరు 08 రాజధాని వాయిస్ : పట్టణం లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం, విక్రయాలు, నిల్వను పూర్తిగా నివారించేందుకు మున్సిపల్ అధికారులు ప్రత్యేక తనిఖీ లు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన కల్పిస్తూ, నిషేధిత ప్లాస్టిక్ వస్తువులపై తనిఖీలు చేపడుతున్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ప్రభుత్వ నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్లాస్టిక్ కవర్లకు బదులుగా గుడ్డ సంచులు, పునర్వినియోగ సంచులు, పర్యావరణహిత వస్తువులను వినియోగించాలని వ్యాపారులు, ప్రజలకు సూచించారు. వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో వేయకుండా తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించి పట్టణ పరిశుభ్రతకు సహకరించాలని కోరారు. 'ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించండి--పర్యావరణాన్ని పరిరక్షించండి' అని కమిషనర్ పిలుపునిచ్చారు.

## వినాయక నిమజ్జనంలో డీజేలు, ఆర్కెస్ట్రాలకు నో!

వేముల/చక్రాయపేట, సెప్టెంబర్ 8 రాజధాని వాయిస్ వినాయక చవితి వేడుకలను ప్రశా ంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని ఆర్కే వ్యాలీ సీఐ సి. శంకర్‌రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు నిమజ్జ నం సందర్భంగా పలు నిబంధనలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. నిమజ్జన ఊరేగింపులో డీజేలు, ఆర్కెస్ట్రాలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. ట్రాక్టర్, లారీ, ఆటో తదితర వాహనాల డ్రైవర్లు తప్పనిసరిగా చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, వాహనాలను జాగ్రత్తగా నడపాలని సూచించారు. విగ్రహాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని నిర్వాహకులకు తెలిపారు. నిమజ్జనం పూర్తయ్యే వరకు నిర్వాహకులు, వాలంటీర్లు అక్కడే ఉండి భద్రతను పర్యవేక్షించాలని కోరారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పోలీసుల సూచనలు పాటిస్తూ పండు గను సోదరభావంతో ప్రశాంతంగా నిర్వహించాలని సీఐ శంకర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

PRINTED, PUBLISHED AND OWNED BY PAGALA PURNA CHANDRA RAO. MUTUKURU (POST) DURGI MANDAL MACHERLA CONSTITUENCY. PALNADU DISTRICT.AP.DOOR N0 0-004 PINCODE 522612 PHONE NUMBER 9030343195. PRINTED AT SRI KANAKA BHARGAV OFF-SET PRINTERS. MAIN ROAD ANJANEYA COLONY REDDYPALEM GUNTUR 522009 ANDHRA PRADESH . EDITOR :PAGALA PURNA CHANDRA RAO
RNI NO :APTEL/2023/90201PHONE NUMBER : 9030343195.EMAIL. rajadhanivoicedaily@gmail.com